క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఇసీ దినేష్ రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

18న ఎమ్మార్పీఎస్ చలో ఢిల్లీ

ముద్దనూరు : ఈనెల 18వ తేదీన పలు డిమాండ్ల సాధన కోసం ఏపీ ఎమ్మార్పీఎస్ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ శాఖ ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ నాయకత్వంలో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను 50 నుంచి 80 శాతం వరకు పెంచాలని, దళితులలో పేదరికం, అంటరానితనం నిర్మూలనకు కేంద్ర ప్రభుత కమిటీనీ నియమించాలని తెలిపారు. దళిత, గిరిజనులకు అసెంబ్లీ, పార్లమెంటులో జనాభా ప్రాతిపదికన సీట్లనుపెంచాలని కోరుతూ ఈ ధర్నా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్, పులివెందుల రోడ్డు, రవిరెడ్డి పెట్రోలు బంకు, ధర్మారెడ్డి రైస్ మిల్లు, తిరుమల హాలు సెంటర్, చింతలమడుగుపల్లె, తదితర ప్రాంతాలలో సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి 11 గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ సిబ్బంది శివదినేష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

క్రీస్తు జననం మానవాళికి పర్వదినం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభువైన ఏసుక్రీస్తు జననం సకల మానవాళికి పర్వదినమని గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ మణి తెలిపారు. శనివారం నగరంలోని చంద్రమౌళి నగర్‌లో ఉన్న రక్షణ మినిస్ట్రీస్ మందిరంలో గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవ సేవకురాళ్ల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రక్షణ మినిస్ట్రీస్ ద్వారా వారు చేస్తున్న దేవుని సేవ, సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రానున్న క్రిస్మస్ పండుగ, నూతన సంవత్సర వేడుకలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కొత్త సంవత్సరంలో దేవున్ని మరింత స్తుతించి ఘనపరచాలని, సువార్తను అందరికీ ప్రకటించాలని పిలుపునిచ్చారు. దైవ సేవకురాళ్లు లలితమ్మ, మోపూరి వనజ, కవిత, సలోమి మాట్లాడుతూ గ్లోబల్ యూనిటీ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసిన చైర్మన్ డాక్టర్ ఎంఎస్ మణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మారుమనస్సు పొంది ఏసుక్రీస్తును నిజ రక్షకునిగా అంగీకరించేలా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టరమ్మలు సిస్టర్లు సంధ్య, హెప్సిబా, బండి మార్తమ్మ, విజయ, రాజేశ్వరి, సుజాత, శాంతకుమారి ఎస్తేర్‌లు పాల్గొన్నారు.

19న మెడికల్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విజయవాడలో ఈ నెల 19న ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ 6వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో శనివారం మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ విభాగాల సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించా లని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభల్లో ఉద్యోగులు, కార్మికుల సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కావున అందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

అవార్డు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన వర్ధమాన టీవీ, సినీనటుడు దావూద్.. సూపర్ స్టార్ రజనీకాంత్–2024 అవార్డును అందుకున్నాడు. ఇటీవల హైదరాబాదులోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇందిరి ఆర్ట్స్ ఫౌండేషన్‌వారు సూపర్‌స్టార్ రజనీకాంత్ అవార్డును పలువురు సినీనటులు సమక్షంలో దావూద్‌కు అందించిన ఘనంగా సత్కరించారు. ఈ అవార్డు అందుకోవడం ఆనందకరమని, భవిష్యత్‌లో మరిన్ని పాత్రలు పోషించి మరిన్ని అవార్డులు అందుకుంటానని దావూద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నీరు వృథా... తప్పని వ్యథ

- ఇబ్బందులలో ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ శాఖ అధికారులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని దర్గా వీధి రెండవ లైన్‌లో గత నెల రోజులకుపైగా నీటి సరఫరా అయ్యే మున్సిపల్ పైపులైన్ పగలడంతో ఆ చుట్టూ పక్కల ప్రాంతాలలో నీరు నిల్వ ఉంటోంది. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రివేళల్లో వీధి దీపాలు లేక వృద్ధులు, చిన్నపిల్లలు అటువైపు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం తీసిన ఫిల్లర్ల గుంతలలో నీరంతా చేరి నీటి గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో గత నెల రోజులకుపైగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే పగిలిన నీటి పైపులైన్‌ను సరిచేసి నీరు వృథా కాకుండా, అలాగే ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా వెలగని వీధి దీపాలను వెలిగేలా చూడాలని కోరుతున్నారు.



పులివెందుల దర్గావీధి రెండవ లైన్‌లో పైపులైన్ పగలడంతో నీటి కుంటగా మారిన ప్రాంతం

రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డుకు ఇరువైపులా నీటి పైపులైన్ పగలడంతో నీరంతా చేరి నీటి కుంటగా ఏర్పడింది. దీంతో రాత్రివేళల్లో ఆదమరిచి నడిస్తే ప్రమాదాలు తప్పవు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు తెలిపినా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలి.

– రామాంజి, స్థానికుడు, పులివెందుల

వీధిలైట్లు వెలగడంలేదు



పట్టణంలోని దర్గా వీధి రెండవ లైన్‌లో వీధిలైట్లు వెలగక రాత్రిళ్లు అంధకారంలో ఉంటున్నాం. అలాగే పైపులైన్ పగలడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి సరి చేయాలి.

– ప్రసాద్, స్థానికుడు, పులివెందుల

లోక్ అదాలత్‌లో 158 కేసులు పరిష్కారం

కమలాపురం : కేసుల పరిష్కారంలో రాజీ మార్గం రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించు కోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరు వర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 158 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 135 క్రిమినల్, 7 సివిల్, 16 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. మెజిస్ట్రేట్ కక్షిదారులను చేతులు కలిపి రాజీ చేశారు. అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ లావణ్య మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులను సత్వరం పరిష్కరించు కోవచ్చన్నారు. రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట పరిష్కరించు కోవచ్చన్నారు. లేని పక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

చిన్న చిన్న సమస్యలపై పంతాలకు పోవద్దు

జమ్మలమడుగు రూరల్ : చిన్న చిన్న సమస్యలపై పంతాలకు పోవద్దని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన పొరపాటు వల్ల అనేక మంది స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తుందన్నారు. జైలు జీవితం అనుభవించిన వారు సమాజంలోకి వెళ్లిన తరువాత వారిలో మార్పు రావాలన్నారు. కక్షిదారులు ఇటువంటి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 1058 కేసులు పరిష్కారం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, ఎక్సైజ్ సీఐలు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సెక్రటరీ కె.వి.మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

నేడు కాశిరెడ్డి నాయన ఆరాధన

లింగాల : స్థానిక శ్రీకాశిరెడ్డి నాయన ఆలయంలో ఆదివారం కాశిరెడ్డి నాయన ఆరాధన నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, భక్తులు తెలిపారు. ఆరాధన సందర్భంగా జ్యోతి అభిషేకాలు, సాయంత్రం గంగ హారతి, జ్యోతి ప్రజ్వలన ఉంటుందన్నారు. అలాగే భక్తులకు ఉదయం నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

బండలాగుడు పోటీలకు సర్వం సిద్ధం

కాశిరెడ్డి నాయన ఆరాధన సందర్భంగా ఉదయం 9 గంటలకు దేశపు సీనియర్ వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో మొదటి బహుమతి కింద రూ.70 వేలు, రెండవ బహుమతి కింద రూ.50 వేలు, మూడవ బహుమతి కింద రూ.40 వేలు, నాల్గవ బహుమతి కింద రూ.30 వేలు, 5వ బహుమతి కింద రూ.20 వేలు, 6వ బహుమతి కింద రూ.20 వేలు ఇవ్వనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు

కాశిరెడ్డి నాయన ఆరాధన సందర్భంగా ఆలయ ఆవరణలో తాళాల భజన, కర్రెల కోలాటం, నెల్లూరు శ్రీసాయి ఈవెంట్స్ వారిచే ఆర్కెస్ట్రా, పంచరత్నాలు నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కావున భక్తులు కాశిరెడ్డి నాయన ఆరాధనలో పాల్గొనాలని వారు కోరారు.

దుప్పట్ల పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక రోటరీ ఐ ఆస్పత్రి వద్ద శనివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సాధువులు, నిరాశ్రయులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ టి.బాలసూర్యారావు మాట్లాడుతూ ఇటీవల చలి తీవ్రత ఎక్కువ కావడంతో సాధువులు, నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 70 మందికి దుప్పట్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జి.శ్రీధర్ శర్మ, ట్రస్టు ప్రెసిడెంట్ శివకుమార్, స్పందన రాంప్రసాద్‌రెడ్డి, జాకీర్ మహమ్మద్, జి.వెంకటేశ్వరరెడ్డి, వి.నరసింహారావు, కె.మల్లికార్జున, ఆర్టీసీ బాబా, రామకృష్ణ, నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికలు

కమలాపురం : మండలంలోని 4 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. కమలాపురం చెరువు సంఘం చైర్మన్‌గా చాపాటి ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా గుజ్జుల నాగశేఖర్‌లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైలవరం దక్షిణ కాలువకు సంబంధించి ఎర్రగుడిపాడు సంఘానికి వైఎం సురేష్‌కుమార్‌రెడ్డి, వడ్డెమాను సావిత్రిలు చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎంపికయ్యారు. సంబటూరు మెలవరం కెనాల్ సంఘ చైర్మన్‌గా పుత్తాబాలిరెడ్డి, వైస్ చైర్మన్‌గా పి.ప్రభాకర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్ని సంఘాల ఎన్నికల సరళిని మండల తహసీల్దార్ పర్యవేక్షించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : మండల పరిధిలో శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అచ్చివెళ్లి నీటి సంఘం అధ్యక్షుడిగా రామగంగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సోమేశ్వరరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రంరెడ్డిపల్లె నీటి సంఘం అధ్యక్షురాలుగా గంగమ్మ, ఉపాధ్యక్షురాలుగా గజ్జెల నిరూపలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో టీసీ మెంబర్‌తోపాటు చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. డబ్ల్యూ 7 కాలువకు సంబంధించిన నీటి సంఘం ఎన్నికలు ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహించారు. మొత్తం 12 టీసీలకు ఏడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా ఐదు టీసీ మెంబర్‌లకు నామినేషన్‌లు కూడా దాఖలు కాలేదు. దీంతో ఎన్నికల అధికారి శివారెడ్డి నీటి సంఘంనకు సంబంధించిన 1, 2, 4, 9, 10, 11, 12ల ఒక్కటే నామినేషన్ దాఖలు కావడంతో వారు ఏకగ్రవం అయినట్లు ప్రకటించారు. అనంతరం నీటి సంఘం చైర్మన్‌గా ఆర్.శివారెడ్డి, వైస్ చైర్మన్‌గా వెంకటరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అదేవిధంగా ఉప్పలపాడు నీటి సంఘం ఎన్నికల్లో 12 మందికి గాను 8 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో చైర్మన్‌గా రామమోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : గుండ్లకుంట సాగునీటి సంఘానికి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఉలవల మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కాసా వెంకటరమణారెడ్డి ఎన్నికయ్యారు. గుండ్లకుంట సాగునీటి సంఘంలో మొత్తం 12 టీసీ మెంబర్లు ఉండగా 4 టీలలకు వీఆర్వోలు నోడ్యూ సర్టిఫికెట్ ఇవ్వకపోవటంతో 8 టీసీలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. 7 టీసీలలో రైతు ఏకగ్రీవం కాగా 1 టీసీ కూటమి ప్రభుత్వం మద్దతుదారుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో 12 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగగా గుండ్లకుంట మినహా మిగతా చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శనివారం సాయంత్రం సింహాద్రిపురం మండలంలోని ఐదు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలను పీబీసీ ఈఈ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని అంకాలమ్మ గూడూరు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా వై.అమర్నాథరెడ్డి, ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌రెడ్డి, సింహాద్రిపురం సాగునీటి సంఘ అధ్యక్షుడిగా వి.వెన్నపూస సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పవన్‌కుమార్‌రెడ్డి, కసనూరు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా మారెడ్డి జోగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కాటసాని ప్రతాపరెడ్డి, హిమకుంట్ల సాగునీటి సంఘ అధ్యక్షుడిగా వై.సూర్యశేఖరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వేమ పద్మనాభరెడ్డి, బలపనూరు సాగునీటి సంఘ అధ్యక్షుడిగా వీరప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండి రాజేశ్వరిలతోపాటు సభ్యులు ఎంపికయ్యారన్నారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : మండలం పరిధిలో హనుమనుగుత్తి, పోట్లదుర్తి, ఇల్లూరు, చిన్నదండ్లూరు పరిధిలో శనివారం జరిగిన సాగునీటి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలను తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీఓ వెంకటరమణయ్యలు పర్యవేక్షణ చేశారు. నాలుగు నీటి సాగు సంఘాలకు గాను ఒక్కొక్క సాగు నీటి సంఘం కింద 12 మంది ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీరందరు కలసి నాలుగు నీటి సాగు సంఘాలలో ఆయా సాగు నీటి సంఘాలకు సంబధించి అధ్యక్షులను ఉపాధ్యాక్షులను ఎన్నుకున్నారు. సీఐ నరేష్‌బాబు, కలమల్ల ఎస్‌ఐ తిమోతిలు బందోబస్తు నిర్వహించారు.



ఎర్రగుంట్ల : ఇల్లూరు గ్రామంలో కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శోభన్‌బాబు

లింగాలలో..

లింగాల : దొండ్లవాగు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని 12 టీసీలకు శనివారం పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు జరిగాయి. ఈ డిస్ట్రిబ్యూటరీ కింద 12 టీసీలకుగానూ 10 టీసీలకు నామినేషన్లు దాఖలు కాగా, 2 టీసీలకు టీడీపీకి అభ్యర్థులు దొరకక టీసీ మెంబర్లను నియమించుకోలేని పరిస్థితి నెలకొంది. 10 టీసీలకు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ధర్మేంద్రకుమార్ తెలిపారు. ఏకగ్రీవంగా ఎంపికైన 10 మంది మెంబర్లు కలిసి దొండ్లవాగు డిస్రిట్యూటరీ అధ్యక్షుడిగా రామాపురం గురివిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా దొండ్లవాగు గ్రామానికి చెందిన కరుణకుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారి ప్రకటించారు.

ముద్దనూరులో

ముద్దనూరు : మండలంలో చింతకుంట ఎన్నికల్లో అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సానె గురయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ముకుందరెడ్డి తెలిపారు. చిన్నదుద్యాల చెరువుకు అధ్యక్షుడిగా పెద్ద గఠ్రప్ప, ఉపాధ్యక్షుడిగా నాగార్జునరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

వల్లూరులో

వల్లూరు : మండల పరిధిలోని 7 గ్రామాల్లో శనివారం నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించినట్లు తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు. ఇందులో అంబవరం నీటి సంఘ ప్రెసిడెంట్‌గా ఎస్.శివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా పీ చంద్రశేఖర్‌రెడ్డి, గోటూరు నీటి సంఘం ప్రెసిడెంట్‌గా సీ సుబ్బమ్మ, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్ వెంకటసుబ్బారెడ్డి, తప్పెట్ల నీటి సంఘం ప్రెసిడెంట్‌గా ఎమ్ సదాశివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా బత్తల గొల్ల నాగన్న, కొప్పోలు నీటి సంఘం ప్రెసిడెంట్‌గా ఎమ్ లక్ష్మిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా టీ విజయేంద్రారెడ్డి, పెద్దపుత్త నీటి సంఘం ప్రెసిడెంట్‌గా వెంకట శివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా టీ ప్రసాద్‌రెడ్డి, పైడికాలువ నీటి సంఘం ప్రెసిడెంట్‌గా ఏ వెంకట సుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా గండి రవి, తోల్లగంగనపల్లె నీటి సంఘం ప్రెసిడెంట్‌గా ఎమ్ చంద్రమోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా వీ దేవమ్మ ఎన్నికైనట్లు తహసీల్దార్ తెలిపారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పులివెందుల బ్రాంచి కాలువ సంఘం చైర్మన్‌గా అంబవరం పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గిడ్డంగివారిపల్లె నీటి సంఘ అధ్యక్షుడుగా మల్లింగి చంద్రసేన, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మీనరసమ్మ, టి.వెలమవారిపల్లె నీటి సంఘం అధ్యక్షుడుగా బాల గురప్ప, గండి శ్రీవీరాంజనేయస్వామి నీటి సంఘ అధ్యక్షురాలిగా రమీజాబీ, ఉపాధ్యక్షుడుగా పెద్దింటి లక్ష్మణ్, గుండ్లమడుగు నీటి సంఘం అధ్యక్షుడుగా పెద్దన్న, ఎద్దులకొండ నీటి సంఘం అధ్యక్షుడుగా సుబ్రమణ్యంలు ఏకగ్రీవమయ్యారు.

పెండ్లిమర్రిలో

పెండ్లిమర్రి : ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు సాగు నీటి సంఘాల ఎన్నికలు బహిష్కరించడంతో మండలంలోని నందిమండలం, గంగనపల్లె, పెద్దదాసరిపల్లె, మాచునూరు నాలుగు సాగు నీటి సంఘాలకు శనివారం అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలల్లో టీడీపీ నాయకులు ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు.

మధ్యాహ్న భోజనం వద్ద కుక్కల బెడద

పులివెందుల రూరల్ : మండల పరిధి నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనం చేస్తున్న సమయంలో వారి ప్లేట్ల వద్దకు కుక్కలు వచ్చి వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో విద్యార్థులు భోజనం తింటున్న సమయంలో కుక్కలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులు భోజనం తింటున్నప్పుడు అక్కడికి వచ్చిన కుక్క →



విశ్రాంత అధ్యాపకుడు పుల్లారెడ్డికి అవార్డు

ముద్దనూరు : స్థానిక విశ్రాంత తెలుగు అధ్యాపకుడు బెంగళూరులోని యూనివర్సిటీ అరుదైన అవార్డును ప్రదానం చేశారు. శనివారం బెంగళూరులోని శివాజీనగర్‌లో భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫార్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం కళలు, సామాజిక సేవలో రాణించిన పుల్లారెడ్డికి ఈ అవార్డును అందజేశారు. పుల్లారెడ్డి అధ్యాపకుడిగానే కాకుండా నాట ప్రదర్శనల్లో ప్రతిభ కనబరచారు. పలు సాంస్కృతి కార్యక్రమాల్లో ఆయన నాటకాల్లో వివిధ వేషాలు వేశారు. అల్లూరి సీతారామరాజు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్రదారణల్లో ఆయన ఆకట్టుకున్నారు. ఇటీవల కడప నగరంలో రెడ్డి సేవా సంఘం సమావేశంలో ఆయన నాటక ప్రదర్శన చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో యూనివర్శిటీ డీన్ స్వామినాథన్, వైస్ చైర్మన్ తంగరాజన్, సుప్రీంకోర్టు స్టాండింగ్ కమిటీ మెంబర్ రాగసందేశ్, కల్నల్ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న పుల్లారెడ్డి, విశ్వవిద్యాలయ ప్రతినిధులు

ఆధ్యాత్మిక కేంద్రంగా కాశినాయన ఆలయం

వీరపునాయునిపల్లె : ఎన్.పాలగిరి క్రాస వద్ద వెలసిన కాశిరెడ్డి నాయన ఆలయం 19 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రతి ఏడాది మార్గశిర మాసం పౌర్ణమి రోజున ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఆరాధన మహోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ప్రతినెల పౌర్ణమి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిండంతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

ఆలయ నిర్మాణం

మండలంలోని గోనుమాకులపల్లె గ్రామానికి చెందిన నర్రావుల శంబురెడ్డి 2005లో కాశిరెడ్డి నాయన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. అప్పట్లో చిన్నపాటి కొట్టం ఏర్పాటు చేసి కాశిరెడ్డినాయన చిత్రపటాన్ని పెట్టి భక్తులు పూజలు నిర్వహించేవారు. అప్పటి నుంచి దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి ఆయన కుమారుడు పుల్లారెడ్డి ఆలయ నిర్వహణ భాధ్యతలు చేపట్టడంతో ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరాధన మహోత్సవాల్లో బాగంగా ప్రతి భయోటెక్ లిమిటెడ్, ఆర్ఎం కిసాన్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కాశినాయన భజనమండలి తాలాల భజన, మద్యాహ్న 1 గంటకు చాపాడు మండలం చీపాడు గ్రామానికి చెందిన చలపతి బృందం చే కోలాటం, సాయంత్ర 6 గంటలకు వేంపల్లె చైతన్య హైస్కూల్ విద్యార్థులచే నృత్యాలు, రాత్రి 9 గంటలకు శ్రీదేవి డ్రామా కంపనీ జూనియర్ చిరంజీవి, కరీముల్లా గ్రూపు వారిచే డ్యాన్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి న్యూకేటగిరి రాష్ట్ర స్థాయి విభాగం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు అమ్మోడి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఇసుకపల్లె అన్నపూర్ణమ్మ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ప్రత్యేక పూజలందుకోనున్న కాశిరెడ్డినాయన



భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పందిళ్లు

ఆలయ నిర్మాణంలో జాప్యం ఉండదు

సాక్షి ఎఫెక్ట్..

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ మృత్యుంజయస్వామి నూతన ఆలయ భవన నిర్మాణాలలో జాప్యం ఉండబోదని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్ జి.మల్లికార్జునప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాక్షి దిన పత్రికలో వెలువడిన 'మృత్యుంజయా...ఇదేం జాప్యం స్వామి' అనే వార్తపై ఆయన స్పందించారు. దేవదాయశాఖ కమిషనర్ 2022వ సంవత్సరంలో సీజీఎఫ్ నిధుల నుంచి రూ.38.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. తర్వాత కర్నూలు మల్టీజోన్–2 కార్యనిర్వాహక ఇంజినీరు టెక్నికల్ పర్మిషన్ మంజూరు చేశారన్నారు. సంయుక్త కమిషనర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పీసీఎస్‌ఆర్ కోసం రూ.31,75,148కు లోయస్ట్ టెండరు అప్రూవల్ చేశారన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి 2023 ఆగస్టు 5న ఆ టెండరు మేరకు వారితో అగ్రిమెంట్ వర్క్ ఆర్డర్ జారీ చేశారన్నారు. కాంట్రాక్టర్ ఇప్పటికే ఉన్న ఆలయ పునాదులపై కొత్తగా ఆలయ నిర్మాణ పనులు చేసేందుకు కమిషనర్ సీజీఎఫ్ నిధుల నుంచి రూ. 38.50 లక్షలు మంజూరు చేశారని, కాంట్రాక్టర్ ఆ మేరకే పనులు చేశారన్నారు. 2024 అక్టోబరు 24న కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి ఆలయానికి విచ్చేశారని, జరుగుతున్న పనులను పరిశీలించి ఆలయ పునఃనిర్మాణానికి తనవంతుగా రూ.50 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. దేవదాయశాఖ కడప సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారితో చర్చించి ఆలయాన్ని పూర్తిగా రాతితో నిర్మించేందుకు దాదాపు రూ.4 కోట్లతో పునః ప్రతిపాదనలు చేయాలని సూచించారన్నారు. ఈ కారణంగా నూతన ప్రతిపాదనల మేరకే ఆలయ పునః నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

కడప కల్చరల్ : శ్రీ దత్తాత్రేయస్వామి జయంతిని శనివారం కడప నగరంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రామకృష్ణనగర్‌లోని శ్రీ సాయి శనీశ్వర ఆలయంలో ఉదయం స్వామికి కాగడ హారతి, అభిషేకం, శ్రీ అనఘాష్టమి వ్రతం, శనీశ్వర స్వామికి తైలాభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ, సాయి శర్మ, స్వామి సేవకులు చంద్రశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.